ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార కల్తీ నియంత్రణ అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలోని పలు హోటళ్లలో ఆదివారం ఆహార కల్తీ నియంత్రణ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్‌తో పాటు కేంద్ర ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ మిశ్రా కలిసి గుత్తిరోడ్డులోని పిస్తా హోటల్, ఓటీజీ హోటల్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల మేరకు ఆహార పదార్థాలు ఉన్నాయా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అని పరిశీలించారు. ఆయా హోటళ్లలో కిచెన్‌రూమ్, స్టోరేజీ రూమ్, డైనింగ్ హాల్, ఆహార తయారీ విధానాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాల్లో కాలపరిమితి తీరినవి ఉన్నాయేమోనని చూశారు. హోటల్ పరిసరాలు శుభ్రంగా ఉంచుతున్నారా, వంట చేసేవారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. తాగునీటిని పరిశీలించి సంతృప్తి చెందారు. జీఎస్టీ చెల్లిస్తున్నారా, ఫుడ్ లైసెన్స్ తీసుకున్నారా అని పరిశీలించారు. హోటల్‌లకు వచ్చిన వినియోగదారుల అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయా హోటళ్లకు సంబంధించి రేటింగ్ ఇచ్చేందుకు తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఎంపీ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైతులు పండించిన పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. పొగాకుతోపాటు కరోనా సమయంలో నిలిపిన రైళ్లను పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన ఎంపీని కోరారు.

సుద్దవాగులో పూడికతీత



పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం సుద్దవాగులో పూడికతీత పనులు ప్రారంభించారు. రెండు జెసీబీ లు, ఒక హిటాచీలను వినియోగించి 1.25 కిలోమీటర్ల పరిధిలో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. మరో నాలుగు రోజుల వ్యవధిలో ఈ పనులు పూర్తి చేసి వ్యర్థాలను ట్రాక్టర్లలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. పనులు పూర్తయితే వాగు వెంబడి ఉన్న కాలనీల ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

బసవ జయంతి ఘనంగా నిర్వహించాలి



హాజరైన వీరశైవ ఐక్యవేదిక నాయకులు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన మహాత్మా బసవేశ్వరుల వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వీరశైవ ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆదివారం వీరశైవ ఐక్యవేదిక నాయకులు నగరంలోని విష్ణు టౌన్‌షిప్‌లో బసవ జయంతి సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బసవ జయంతిని అధికార కార్యక్రమంగా ప్రకటించినందున ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. వీరశైవ ఐక్యవేదిక నాయకులు మల్లికార్జునప్ప, విశ్వేశ్వరయ్య, చంద్రశేఖరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



నేర చరితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు (టౌన్): నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని పోలీసులు సూచించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు, నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో జీవించాలని సూచనలు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి వారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హొళగుంద సిద్దేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు చేశారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి, జింఖానా, సారంగపాణి జాతకం, అన్‌టిల్ డాన్, నె ఝా 2, తుడరుం

వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : సారంగపాణి జాతకం, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి, తుడారుం, జింఖానా, అన్‌టిల్ డాన్, సోదర (ఇట్స్ రొమాంటిక్ స్టోరీ),చౌర్య పాటం, ఓదెల 2, భరత్ అనే నేను (2018)

వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సారంగపాణి జాతకం, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి, తుడారుం

శ్రీరామ : అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి

రాజ్ : తుడారుం

భరత్ కాంప్లెక్స్ : చౌర్య పాటం, ఏఎల్‌సీసీ (ఓ యూనివర్సల్ బ్యాచిలర్)

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన



మాట్లాడుతున్న ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు మోక్షేశ్వరుడు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరు మెరుగైన ఆరోగ్యం కలిగి ఉండాలని ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. స్థానిక బుధవారపేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం ఆరోగ్య భారతి అభ్యాసక వర్గ కార్యకర్తలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య భారతి ఉపాధ్యక్షుడు శ్రీధర శర్మ, డాక్టర్లు స్ఫూర్తి, ద్వారం ప్రభాకరరెడ్డి, ఎస్.వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి వివిధ అనారోగ్య సమస్యలు, పరిష్కార మార్గాలను వివరించారు. యోగా గురువు అనురాధ యోగ, ధ్యానంపై అవగాహన కలిగించారు. ఆరోగ్య భారతి ఏపీ ప్రాంత కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎస్ రామశర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కార్యకర్తలు రాఘవేంద్ర, వెంకటేష్, డాక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలు అందించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు.

నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

విద్యను ప్రైవేటీకరించేలా ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు విద్యను ప్రైవేటుపరం చేసి వ్యాపారంగా మారుస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ విమర్శించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జరుగుతున్న జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్యా వ్యవస్థను పరిరక్షించుకోవడానికి విద్యార్థులు ముందుకు రావాలన్నారు. పోరాటాల ద్వారానే ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఎవరికి వారు స్వచ్ఛందంగా ఉద్యమాల్లో పాల్గొనాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలు చేస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా పాల్గొన్నారు.

కార్యసిద్ధి ఆంజనేయుడికి సింధూరార్చన

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి నవగ్రహ, లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత చండీహోమం, అర్చనలు, అభిషేకాలు, సింధూరార్చన తదితర పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీతను ప్రచారం చేస్తున్న దృశ్యం

కల్లూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కల్లూరు, కర్నూలు కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, అంబేడ్కర్‌రోడ్డు, పెద్దపాడు గ్రామంలో భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు, కర్నూలు కమిటీ అధ్యక్షులు, సభ్యులు పురుషోత్తం, నాగయ్య, శివ, గంగాధర్, ఓబులేసు, ఈశ్వరయ్య, అక్షిత్, మౌనిక, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతపై కవితలు రావాలి

కర్నూలు కల్చరల్: దేశ సమైక్యతపై కవితలు రావాల్సిన అవసరం ఉందని టీజీ వెంకటేష్ అన్నారు. ప్రముఖ కవి గద్వాల ఈరన్న రచించిన 'కవిగూరగంప' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా టీజీ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో, దేశ సమైక్యత, మత సామరస్యం, శాంతి అంశాలపై కవులు రచనలు చేయాలన్నారు. సాహితీ వేత్త గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి పుస్తక సమీక్ష చేశారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కవులు జ్యోతిర్మయి, రామకృష్ణ, ముద్రిక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఘనంగా అమావాస్య వేడుకలు



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వేడుకలకు వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో భక్తులు అధికంగా స్వామి దర్శనానికి తరలిరావడంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

రైలు నుంచి కింద పడి వ్యక్తికి గాయాలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం నారాయణపురం గ్రామానికి చెందిన జి.రాజశేఖర్ అనే వ్యక్తి రైలు(నం.16382) నుంచి దిగుతూ కింద పడడంతో కుడి చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. వెంటనే స్టేషన్ మాస్టర్ వెంకటేశులు, జీఆర్‌పీ పోలీసులు అంబులెన్స్‌లో గాయపడిన రాజశేఖర్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు భరత్ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేసినట్లు వెల్లడించారు.

తైక్వాండోలో రాణించాలి



తైక్వాండో శిబిరాన్ని ప్రారంభిస్తున్న రమేష్‌బాబు

కర్నూలు (టౌన్): ఒలింపిక్ క్రీడ తైక్వాండోలో రాణించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఊట్ల రమేష్‌బాబు క్రీడాకారులకు సూచించారు. స్థానిక పాతబస్టాండ్‌లోని కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న కేఎంసీ పార్కులో ఆదివారం తైక్వాండో శిక్షణ, బెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు, క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం క్రీడల్లో రాణిస్తే అవకాశాలు ఉన్నాయని, గుర్తింపు ఉన్న క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని క్రీడాకారులు చక్కగా సాధన చేసి ప్రతిభ చాటాలన్నారు. అనంతరం బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటి బ్లాక్ బెల్టులు సాధించిన మంజునాథ్, హరికృష్ణను అభినందించారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చింత చిగురుతో ఉపాధి



కల్లూరు: వేసవి కాలం ప్రారంభమవ్వడంతో మార్కెట్‌లోకి మామిడి పండ్లతో పాటు చింత చిగురు కూడా వచ్చేససింది. చింతచిగురు ఎక్కువగా ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న కాలంలో (వేసవి కాలం)లో విరివిగా లభిస్తుంది. చాలా మంది చింత చిగురు రుచిని ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతారు. పప్పు, చట్నీతో పాటు చికెన్‌లో చింత చిగురు వేసి వండి తింటారు. ఆరోగ్య పరంగా కూడా మేలు చేస్తుండటంతో చిగురుతో చేసిన ఆహార పదార్థాలను చాలా మంది ఇష్ట పడతారు. దీంతో మార్కెట్‌లో చిగురుకు డిమాండ్ ఉండటంతో గ్రామీణ ప్రాంతాల మహిళలు, యువకులు చింత చిగురు సేకరణను ఉపాధిగా మార్చుకుంటున్నారు. ఎత్తైన చెట్లను సులువుగా ఎక్కి చిగురు కోసుకుని పట్టణాలో విక్రయిస్తున్నారు. సేకరించిన చిగురును రైతుబజార్, ప్రధాన కూడలలో కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. కుప్ప సైజును బట్టి రూ.10, రూ.20 చొప్పున విక్రయించి ఆదాయం పొందుతున్నారు.



చిటారు కొమ్మలెక్కి చిగురు కోస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం అందజేత

గోనెగండ్ల: మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో రెండు రూపాయల బిళ్లను మింగిన హసీనా ఆపరేషన్ కోసం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. శ్రీరామ్ నగర్ జానీ, ఖాజాబీ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. గ్రామంలో కూలీ పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కూతురు హసీనా గోనెగండ్లలో 7వ తరగతి చదువుతోంది. హసీనా మూడేళ్ల క్రితం ఆడుకుంటూ రెండు రూపాయల బిళ్లను మింగింది. అప్పట్లో తండ్రి జానీ ప్రథమ చిత్స చేయించాడు. మలవిసర్జన సమయంలో పడిపోయిందని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే మూడు నెలల క్రితం హసీనాకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించినప్పటికీ తగ్గలేదు. ఎక్స్‌రే తీయించగా పెద్ద పేగులో రెండు రూపాయల బిళ్ల ఉందని.. హైదరాబాదుకు తీసుకువెళ్లమని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడ వైద్యులకు చూపించగా వారు చెన్నైకు వెళ్లమని సలహా ఇచ్చారు. దీంతో అక్కడి నుంచి హసీనాను చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఆపరేషన్ చేసి రెండు రూపాయల బిళ్లను తీసేందుకు రూ.7లక్షలు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.24వేలు పోగుచేసి ఆదివారం వారి హసీనా కుటుంబ సభ్యులకు అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్

కోసిగి: అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి చెందిన మద్యం తరలిస్తుండగా దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్ సిబ్బందితో కలిసి నదితీర గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో అగసనూరు గ్రామానికి చెందిన గొర్లి చిన్న భీమేష్, కోసిగికి చెందిన బి.రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు తుంగభద్ర నది ఒడ్డున గురురాఘవేంద్ర పంప్‌హౌస్ వద్ద 12 బాక్స్‌లలో 1152 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను గ్రామాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.46,080 ఉంటుందని చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ భరత్, రవికుమార్, మునిరంగడు పాల్గొన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం తరలించినా, నాటు సారా తయారు చేసినా సెల్ 94409 02580 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

హరినామ సంకీర్తనతో మానసిక ప్రశాంతత



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఇస్కాన్ ప్రవచకులు హీరాలాల్ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. హీరాలాల్ ప్రభు మాట్లాడుతూ నిత్యం భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ జీవిత గమనానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఎన్నో క్లిష్ట సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● నేటి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు డి.అబ్దుల్‌దేశాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివారం గడియారం ఆసుపత్రి అడ్డాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు రుణాలు ఇవ్వాలని, పిల్లల చదువులకు సహకారం అందించాలని కోరారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్.ఖాజాపాషా, జి.ఏసు, డి.అబ్దుల్లా బతుకన్న పాల్గొన్నారు.

దంత వైద్యుడి కుటుంబానికి చేయూత



డాక్టర్ సుష్మా కౌముదికి ఆర్థిక సాయం అందిస్తున్న ఐడీఏ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): అనంతపురంలో ఇటీవల ఆకస్మిక మరణం చెందిన డాక్టర్ ఏ.మధు కుటుంబానికి ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చేయూతనందించారు. ఆదివారం అసోసియేషన్ నాయకులు అనంతపురంలోని డాక్టర్ మధు ఇంటికి వెళ్లి ఆయన భార్య డాక్టర్ సుష్మా కౌముదికి ఫ్యామిలి బెనిఫిట్ స్కీమ్ కింద రూ.15.65 లక్షలు అందజేశారు. ఐడీఏకు డాక్టర్ మధు అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, కార్యదర్శి అజయ్‌బెనర్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కిశోర్‌కుమార్, ఐడీఏ రాయలసీమ కర్నూలు శాఖ కార్యదర్శి ఆర్.రామచంద్రారెడ్డి, ట్రెజరర్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీపీలను బాధ్యులు చేయడం తగదు



మాట్లాడుతున్న చిన్ని ప్రసన్న

కర్నూలు (టౌన్): భవనాల అనుమతుల విషయంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ఎల్‌టీపీలు (లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్) కీలకంగా వ్యవహరిస్తున్నారని, అయితే యజమానులు చేసే తప్పులను తమపై మోపడం అన్యాయమని కర్నూలు లైసెన్సుడ్ ఇంజినీర్ల సంఘం చైర్మన్ చిన్ని ప్రసన్న అన్నారు. స్థానిక పాతబస్టాండ్‌లోని స్కంద కాంప్లెక్స్‌లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో భవనాల అనుమతులను సులభతరం చేసేందుకు జీఓ 20 జారీ చేశారన్నారు. ఈ జీఓలో ఎల్‌టీపీల విషయంలో ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ప్లాన్ అప్రూవల్ తీసుకున్న భవన యజమాని డీవియేషన్‌కు పాల్పడితే అందుకు తమను బాధ్యులు చేసి ఐదేళ్ల పాటు లైసెన్సు రద్దు చేయడం, చట్టపరంగా చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రైవేటు వ్యక్తులుగా ప్లాన్ అప్రూవల్ వరకు తమ పని ఉంటుందని, అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టారా.. లేదా అన్న విషయాన్ని సంబంధిత సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. యజమానులు చేసే అక్రమాలను తమపై రుద్దడం ఏంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం జీఓలో పొందుపరచిన ఎల్‌టీపీల విషయంలో సవరణలు చేయాలన్నారు. అసోసియేషన్ వైస్ చైర్మన్ నాసీర్‌ఖాన్, కార్యదర్శి శాలు హమీద్, నిర్వహణ కార్యదర్శి కామేష్ గౌడ్, ఎజాస్ అహమ్మద్, రఫీయుద్దీన్, ముస్తాక్ పాల్గొన్నారు.

కోసిగి ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ



బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న కర్నూలు ఆర్‌ఎం టి.శ్రీనివాసులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ కర్నూలు ఆర్ఎం టి. శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ చలపతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తాగునీటి వసతి, ఫ్యాన్లు, కుర్చేందు కుకుర్చీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. బస్టాండ్ వెనుక భాగంలో ఖాళీ స్థలంలో స్కూటర్లు, సైకిళ్ల పార్కింగ్ ప్రాంతంగా మారుస్తామని చెప్పారు. బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసి దుకాణాల ద్వారా బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందని తమ దృష్టి వచ్చిందన్నారు. అలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. అలాగే బస్టాండ్‌లో కార్గో సర్వీసు పార్సల్ పాయింట్ ప్రారంభించేందుకు చర్య లు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆదోని డిపో మేనేజర్ రఫిక్, సిబ్బంది శ్రీనివాసులు ఉన్నారు.

ఈరన్నస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇంటి ఇలావేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టడంతో భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

బుడుములదొడ్డిలో..

మండలంలోని బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయం ఆదివారం రోజు అమావాస్యతో భక్తుల సందడిగా నెలకుంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజినేయస్వామిని దర్శనానికి కూడా తరలిరావడంతో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

రామలింగేశ్వరస్వామి ఆలయం

తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు. కర్ణాటక సరహద్దు ప్రాంతం కావడంతో అధికంగా కర్ణాటక భక్తులు కూడా తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని దిబ్బనకల్ గ్రామ శివారులోని బాట మారెమ్మవ్వ ఆలయం పక్కన మట్కా ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,600 నగదు, మూడు మట్కా చీటీలు, మూడు పెన్నులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కౌతాళం మండలం బదినేహాల్‌కు చెందిన మాదిగ పులి ప్రకాష్, పత్తికొండ మండలం పెద్దహుల్తికి చెందిన దాసరి పులికొండ, ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వై.నాగార్జులను అరెస్టు చేసి, వారిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

లారీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

కోడుమూరు రూరల్: కోడుమూరులో అనారోగ్యంతో మృతిచెందిన లారీ డ్రైవర్ కుటుంబానికి తోటి డ్రైవర్లు, క్లీనర్లు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కోడుమూరుకు చెందిన బోయ శ్రీనివాసులు అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తోటి డ్రైవర్లు, క్లీనర్లు ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి చిన్న రాముడు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రూ.21వేలను కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భాస్కర్, గడ్డం నాగరాజు, వాసు, అశోక్, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.